క్లుప్తంగా

వైభవంగా శాంతి కల్యాణం



శాంతి కల్యాణంలో అర్చకులు, భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–1 కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు మనోజ్ స్వామి, హరినారాయణ నేతృత్వంలో కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. అంతకు ముందు వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరిశుభ్రతతో వ్యాధుల నిర్మూలన



పరిశుభ్రతపై ప్రదర్శన నిర్వహిస్తున్న తిరుమలనగర్ వాసులు

కూర్మన్నపాలెం: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రాణాంతక వ్యాధులను నిర్మూలించవచ్చునన్న నినాదంతో 87వ వార్డులో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. తిరుమలనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, గుడ్డసంచులు వాడాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే ప్రాణహాని నుంచి తప్పించుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు పరమానందం, అప్పలనాయుడు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని ప్రియదర్శినీ కాలనీలో రూ.5కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం వారు శంకుస్థాపన చేశారు. గాజువాక ప్రాంత ప్రజలను దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలపై దృష్టి పెట్టామన్నారు. ఇళ్ల పట్టాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశ్రమలకు తాగునీటి పైప్‌లైన్

గాజువాక: ఆటోనగర్ బి బ్లాక్‌లోని పరిశ్రమలకు తాగునీటి కుళాయిల కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. పాత ఎస్‌ఆర్‌ఎంటీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు తాగునీరు అందించాలన్న సమస్య క్రమంగా పరిష్కారమవుతుందన్నారు. కాగా, తోకాడలోని మహిళలు తమ కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు పప్పు శంకరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరకుల వితరణ



రేషన్ సరకులను అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

గాజువాక : తుంగ్లాం గ్రామానికి చెందిన జి.సుధీర్‌రెడ్డి అనాథలైన మానసిక వికలాంగులకు రూ.40వేల విలువ చేసే రేషన్ సరుకులను అందజేశారు. ప్రతినెలా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అస్తవ్యస్తం.. అవస్థల మయం

శిథిల కల్వర్టులు

కోతకు గురైన రహదారులు

ఇరుకు రోడ్లలో ప్రయాణానికి అగచాట్లు

అగనంపూడి బీసీకాలనీ, అట్టవానిపాలెం వాసుల ఇక్కట్లు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బీసీకాలనీ, కొండవాలు ప్రాంతంలో రోడ్లు, కల్వర్టులు అస్తవ్యస్తంగా మారాయి.ఫలితంగా కొండవాలు ప్రాంతంలోని ప్రజల అవస్థలు అన్నీఇన్నీ కావు. రెండున్నర దశాబ్దాల కిందట యూజీడీ పథకంలో భాగంగా నిర్మించిన సీసీరోడ్లు, కల్వర్టులు ఎక్కడికక్కడే శిథిలమయ్యాయి. మరికొన్నిచోట్ల కోతకు గురవ్వడంతో బీసీకాలనీ, చట్టివానిపాలెం, ఉప్పరకాలనీ, అట్టవానిపాలెం ప్రాంతీయులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మహానేత వైఎస్‌రాజశేఖరరెడ్డి హయాంలో విశాఖ నగర పాలక సంస్థను 2005లో జీవీఎంసీగా అప్‌గ్రేడ్ చేస్తూ గాజువాక మున్సిపాలిటీతోపాటు అగనంపూడి మేయర్ పంచాయతీ విలీనం అయింది. అప్పట్లో అగనంపూడి, దువ్వాడ నిర్వాసితకాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయడంతోపాటు సీసీరోడ్లు వేశారు. అప్పటి జనాభా, ఆవాసాలకు అనుగుణంగా రహదారులు నిర్మించారు. కాలక్రమేనా జనాభా పదింతలు పెరగడం, వాహనాల జోరు పెరిగాయి. అయితే తర్వాత వచ్చిన పాలకులు పట్టించుకపోవడం వల్ల సీసీరోడ్లు, కల్వర్టులు ఎక్కడికక్కడే శిథిలమయ్యాయి. కోతకు గురయ్యాయి. ప్రధాన డ్రైనేజీల వద్ద రోడ్డు కోరుకుపోయింది. దీంతో అవస్థలు పడుతూ రాకపోకలు సాగించాల్సి పరిస్థితి ఏర్పడింది. బీసీ కాలనీ ప్రధాన రహదారిని అనుసంధానం చేస్తూ ఉన్న ప్రతీ వీధి కూడళ్లలో కల్వర్టులు శిథిలమయ్యాయి. జాతీయ రహదారి నుంచి బీసీకాలనీకి అనుసంధానం చేసే ప్రతీ రోడ్డు ఇంచుమించు ఇదే దుస్థితి ఉండడంతో వాహనచోదకులు, పాదచారులు అగచాట్లు పడుతున్నారు. రామాలయం జంక్షన్, దుర్గాలమ్మ ఆలయం ఎదురుగా అట్టవానిపాలెం వెళ్లే రహదారి ఇలా దాదాపు అన్ని రోడ్లు ప్రయాణికులకు ఇబ్బందిరకంగా మారాయి. రాత్రి వేళల్లో నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని కాలనీవాసులు మండిపడుతున్నారు.



బీసీకాలనీ ప్రధాన రహదారి ఇలా..



పాఠశాల సమీపంలోని రహదారి దుస్థితి



దుర్గాలమ్మ గుడికి ఎదురుగా శిథిలమైన రోడ్డు



ఎస్సీ,బీసీకాలనీల అనుసంధాన రహదారిలో కల్వర్టు వద్ద దుస్థితి



హైవే నుంచి వాటర్ ట్యాంక్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టు

మరమ్మతులకు నోచుకోలేదు



అగనంపూడి పంచాయతీగా ఉన్నప్పు బీసీకాలనీ లేఅవుట్ వేశారు. అప్పట్లో 20 అడుగుల రోడ్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి మినహా వీధి రోడ్లు రెండు వైపులా కుదించుకుపోవడం, కల్వర్టులు విరిగిపోవడం, డ్రైనేజీలు శిథిలం కావడంతో ఇరుకు రోడ్లలో రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తుంది. పాలకులు స్పందించి రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీలు పునర్నిర్మాణం చేపట్టాలి.

– ఆర్.శ్రీనివాసరావు, కొండయ్యవలస

అనుసంధాన రహదారే దారుణం..



కర్రివానిపాలెం నుంచి సాయిబాబా మందిరం, పైడిమాంబ ఆలయం వరకు ఉన్న ప్రధాన రహదారి ప్రతీ కూడలి వద్ద రోడ్డు, డ్రైనేజీలు, కల్వర్టులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అతుకుల బొంతల్లా రోడ్లు ఉన్నాయి. నాలుగు రోడ్ల కూడళ్లలో మరీ దారుణంగా ఉన్నాయి. జీవీఎంసీ ఉన్నతాధికారులు దష్టి సారించి పునర్నిర్మాణం చేపట్టాలి.

– కె.భీష్మాచారి, పెదమడక

పట్టించుకునే వారెవరు?



జీవీఎంసీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దశాబ్దం నుంచి ఈ మార్గాల్లో స్థానికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రాత్రి వేళల్లో నడిచి వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వీధి దీపాలు కూడా అంతంత మాత్రంగా వెలుగుతుండడంతో రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనాలు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి.

– కె.రాంబాబు, సెక్టార్–1కాలనీ

క్రికెట్ టోర్నీ విజేత బీపీఆర్ జట్టు



విజేతగా నిలిచిన బట్టు జట్టుకు రూ. లక్ష చెక్, ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలో ఏసీసీ ఎల్‌పీఎల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 8 జట్లు పాల్గొన్నాయి. హోరీహోరీగా సాగిన టోర్నీలో పిట్టవానిపాలేనికి చెందిన బట్టు పైడిరెడ్డి (బీపీఆర్) జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో నమ్మిదొడ్డి జట్టు నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు బహుమతి రూ. లక్ష , ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.70 వేల నగదు, ట్రోఫీలు నిర్వాహకుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలరెడ్డి, చినఅప్పలరెడ్డి, బట్టు సతీష్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎంవీలో పీహెచ్‌డీ రెండో బ్యాచ్ ప్రారంభం



రెండో బ్యాచ్ ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీలో పాల్గొన్న నిపుణులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎం విశాఖపట్నంలో ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీ రెండో బ్యాచ్ ఆదివారం ప్రారంభమైంది. పని చేసే నిపుణుల అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సును ప్రత్యేకంగా రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రోగ్రాంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, బహుళ క్యాంపస్‌ల్లో ప్రత్యక్ష అనుభవాలు ఉంటాయని వారు వివరించారు. కొత్త బ్యాచ్‌లో ఆటోమొబైల్, ఏవియేషన్, కన్సల్టింగ్, బ్రాడ్‌కాస్టింగ్, విద్య, ఐటీ, టెలికమ్యూనికేషన్ వంటి వివిధ రంగాల నుంచి 17 మంది నిష్ణాతులైన వ్యక్తులు ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐఎం రాంచీ డైరెక్టర్ ప్రొఫెసర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ఐఐఎం విశాఖపట్నం నిర్మాణంలోనే కాకుండా దృక్పథంలో కూడా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని ప్రశంసించారు. సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ ప్రశాంత్ ప్రేమ్‌కుమార్ నాయర్ మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లోని స్కాలర్‌లు మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, స్ట్రాటజీ, డెసిషన్ సైన్సెస్ వంటి విభిన్న నిర్వహణ విభాగాల నుంచి వచ్చినవారని, ఇది కఠినమైన, ఆకర్షణీయమైన విద్యా అనుభవానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పీహెచ్‌డీ ప్రోగ్రాం చైర్మన్ ప్రొఫెసర్ అమిత్ శంకర్ మాట్లాడుతూ విజయవంతమైన డాక్టోరల్ ప్రయాణానికి అభిరుచి, సాధన, పట్టుదల, సహనం అవసరమని, ఇవి మార్కెటింగ్ మిశ్రమంలో కీలకమని అభివర్ణించారు. ఐఐఎంవీ డీన్ సూరిశెట్టి విజయ భాస్కర్ ప్లాట్‌ఫాం ఎకానమీ స్వర్ణయుగంలో పరిశోధన, జ్ఞాన సృష్టి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఐఐఎంవీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశోధన ఆలోచనలలో పరివర్తన తీసుకువస్తుందని, ఇది వ్యక్తీకరణను పదును పెట్టడానికి, కమ్యూనికేషన్‌ను పెంచడానికి, అర్థవంతమైన లక్ష్యాల వైపు ఇతరులను ప్రేరేపించడానికి, ప్రభావితం చేయడానికి సహాయపడుతుందన్నారు. చివరగా డీన్ కావేరి కృష్ణన్ మాట్లాడారు.

వర్షం.. రోడ్డు జలమయం



కోరాడ నుంచి హౌసింగ్ బోర్డు వెళ్లే రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు

పెదగంట్యాడ: మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి కోరాడ నుంచి హౌసింగ్ బోర్డు వెళ్లే రహదారి జలమయమైంది. సీతానగరం నుంచి నడుపూరు గెడ్డకు అనుసంధానిస్తూ ఇక్కడ కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ రోడ్డు పనులు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం కురిసిన వర్షానికి నీరు పోయే మార్గం లేకపోవడంతో అక్కడే నిలిచిపోయింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

ఇక్కడ కాలువ నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత వర్షం పడితే నీరు సాఫీగా సాగిపోయేలా ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు అంటున్నారు. కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆకట్టుకున్న పురాతన కెమెరాల ప్రదర్శన



కెమెరాల ప్రదర్శనను తిలకిస్తున్న నగర వాసులు

ఏయూక్యాంపస్: జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా ఆదివారం వీఎంఆర్డీఏ పార్క్ ఆవరణలో ప్రదర్శించిన పురాతన కెమెరాలు ఆకట్టుకున్నాయి. వాల్తేరు ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందకు పైగా విభిన్న రకాల కెమెరాలను ప్రదర్శించారు. 1940 నుంచి నేటి వరకు ఉపయోగించిన కెమెరాలను ప్రదర్శనలో ఉంచి, వాటి ప్రత్యేకతలను సందర్శకులకు సొసైటీ ప్రతినిధులు వివరించారు. కెమెరాలను పరిశీలించిన పలువురు సందర్శకులు, వాకర్స్ వాటితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.ఎ న్.సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాస రెడ్డి, క్లబ్ సభ్యులు వేణుగోపాలరావు, సన్నీ, ఎస్.శ్రీనివాసరావు, రాము, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

పెదగంట్యాడ: పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పెగంట్యాడలోని దుర్గవానిపాలెం కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో ధ్యాన జగత్, శాకాహార జగత్, పిరమిడ్ జగత్ నిర్మాణానికి కృషి చేశామన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ రత్నకుమారి, వంశీ కిరణ్, మీసాల శివగణేశ్వరరావు, కట్టా పద్మ, ప్రమీల, వర్మరాజు పాల్గొన్నారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పంకజ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధి వుడా కాలనీలో ఆదివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. వేద్ నేత్రాలయ సూపర్ స్పెషాల్టీ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 200 మందికి డాక్టర్ పంకజ్ డోంగ్రే, డాక్టర్ బెల్లాల కీర్తి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బెల్లాల జోగారావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేసేవరకూ ఉద్యమం



ఎన్నికైన సీఐటీయూ గాజువాకజోన్ కార్యవర్గ సభ్యులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాల్సిందేనని సీఐటీయూ గాజువాక జోన్ 10వ మహాసభ తీర్మానం చేసింది. సీఐటీయూ గాజువాక జోన్ 10వ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో, డెయిరీలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. ఇటీవల మృతి చెందిన సీనియర్ నాయకులకు ఈ సందర్భంగా ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ గాజువాక జోన్ కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి.రమణ, బంగారు నాయుడు, కోశాధికారిగా లోకేశ్వరరావుతోపాటు మరో 23 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు కె.ఎం.శ్రీనివాస్, కె.కిరీటం, జగన్, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు!



కేఎస్‌పాలెం వద్ద కొత్తగా వేసిన రోడ్డులో గొయ్యి



ఇస్లాంపేట హాస్టల్ సమీపంలో కుంగిన రోడ్డు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలో ఇటీవల నిర్మించిన రోడ్లు గోతులమయంగా మారుతున్నాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఎక్కడికక్కడ రోడ్లు కుంగిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కేఎస్‌పాలెం నుంచి పిట్టవానిపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు మధ్యలో పడిన గొయ్యి కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో గొయ్యి కనిపించకపోవడంతో వాహనచోదకులు పడి గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇస్లాంపేట సచివాలయం నుంచి మద్దివానిపాలెం వరకూ ఇటీవల తారు రోడ్డు నిర్మించారు. అయితే ఈ రోడ్డు కుంగిపోవడంతో భారీ వాహనాలు అందులో ఇరుక్కుంటున్నాయని, ఇటీవల ఓ లారీ అందులో ఉండిపోయిందని తెలిపారు. పనుల నిర్వహణలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ దుస్థితి నెలకొందని చెబుతున్నారు. రోడ్డును ఈ ఏడాది ఏప్రిల్‌లో సుమారు కిలో మీటర్ వరకూ కొత్తగా నిర్మించారని, మూడు నెలలు కాకముందే ఇలా తయారైందని అంటున్నారు. అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే గోతులు పూడ్చి ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

గాజువాకలో భారీ వర్షం



వుడాకాలనీ రోడ్‌లో నిలిచిన వర్షపు నీరు



ఒక వీధి రోడ్‌లో వర్షం నీరు



సింహగిరి కాలనీలో దుర్గంధం

గాజువాకలో ఆదివారం భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఊరట కలిగించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండతో జనం ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి అరగంటపాటు భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి కణితి రోడ్, వుడా కాలనీ రోడ్‌తో పాటు వివిధ రహదారులపై నీరు పారింది. కొన్నిచోట్ల పేరుకుపోయిన చెత్త వర్షానికి తడిసిపోయి దుర్గంధం వెదజల్లింది. – గాజువాక

తల్లి మందలించిందని ఆత్మహత్య

మల్కాపురం: తల్లి మందలించిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపంలోని ఆర్‌కే పురం వద్ద తమ్మిన వరుణ్‌కుమార్ (45) తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. వరుణ్‌కు భవాని అనే మహిళతో 24 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య కలహాలు ఏర్పడటంతో వీరిద్దరూ 18 ఏళ్లుగా దూరంగా ఉంటున్నారు. వరుణ్ తల్లితోనే కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో వరుణ్ మద్యానికి బానిసయ్యాడు. వృత్తి రీత్యా ఎలక్ట్రీషియన్ అయిన వరుణ్.. తను పని చేసి తెచ్చుకున్న డబ్బులతో మద్యం సేవించి ఇంట్లో ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నాడు. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి కూడా పూటుగా మద్యం సేవించిన వరుణ్ ఇంటికి వచ్చి తల్లితో వాదించాడు. దీంతో ఆమె కుమారుడిని మందలించింది. అతని చేష్టలతో విసుగు చెందిన ఆమె తన పెద్ద కుమారుడి వద్దకు వెళ్లిపోయింది. 'తల్లి లేదు, భార్య లేదు, పిల్లలు లేరు'అని మనస్తాపానికి గురైన వరుణ్ తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకుని, వరుణ్ ఆత్మహత్యపై వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.